# మొదటి బహుమతి

"ఈరోజు తేదీ ఎంతో తెలుసా? అంది శారద, ఆవేళ ఉదయం. ఉతికిన బట్టల్ని మడతపెడుతూ తల ఎత్తకుండానే.

విభక్తులలో ఎనిమిదవది అయిన సంబోధనా ప్రథమా విభక్తి జోడించకుండా మాట్లాడుతోందీ అంటే, అది కచ్చితంగా నన్ను ఉద్దేశించే అన్నది, ఆవిడతో 24 ఏళ్ళు కాపురం చేశాక ఎంతో అనుభవం మీద నేను కనిపెట్టిన విషయం.

ఆవిడ అట్లా తేదీ గురించి ఎందుకు అడుగుతోందో, ఆ అడగడంలో తీవ్రత ఎంత ఉందో పసిగట్టలేనంతటి అమాయకుణ్ణి కాదు. అందుకే గమ్మున ఉండిపోయినాను - నవల చదువుకుంటూ.

"నిన్నే - ఈరోజు తేదీ..." అంది శారద, రెట్టించిన గొంతుకతో.

కావాలనే నేను ఆమెవైపు చూడకుండా - "అట్ల నన్ను అడక్కపోతే, ఆ గోడకుండే తెలుగు క్యాలెండరు చూడు శారదా!" అన్నాను చాలా సాదా సీదాగా ఆమెవైపు చూస్తూ.

"నాకు తెలుగూ, ఇంగ్లీషు క్యాలెండర్లతో పనిలేదు శేఖర్‌గారూ! మరో నాలుగు రోజులు మాత్రమే టైముంది. మీరు కథల పోటీలో పాల్గొనేదానికి" అంది శారద గొంతు ఏ మాత్రం తగ్గించకుండా - అయితే ఆమె పెదవులు కళ్ళు మాత్రం నవ్వుని దాచలేకపోతున్నాయి.

నేను ఏదయితే ఊహించానో, ఆ విషయాన్నే చెబుతోంది ఆవిడ.

అవును శారదా! రాస్తాను, ఇంక కాసేపటికి మొదలు పెడతాను. ఎంతసేపూ...' అన్నాను నెమ్మదిగా.

నేను అట్లా మాట్లాడితే- "ఎప్పుడూ ఇంతే నీకు కథల విషయమైనా, ఇంటి విషయమైనా ఒకటే, అన్నీ గొంతు మిందికి వచ్చి కూర్చునేవరకూ మొదలు పెట్టవు. నెలన్నర కిందట వచ్చింది కథల పోటీ ప్రకటన. ఎనిమిది పేజీల కథకి పదివేల రూపాయలు బహుమతి అని. ఆడుతూ, పాడుతూ రోజుకి రెండు ముక్కలు రాసినా ఈ పాటికి అయి

పోయి వుండేది. బద్ధకం ముందు పుట్టీ, ఆ తర్వాత నువ్వు పుట్టి ఉంటావు. అయ్యో రామా! ఒక్క ముక్కన్నా పేపరు మింద పెట్టినావా – అంట! ఊహూఁ లేదే – ఈ పొద్దు మొదలు పెడితే ఎప్పుడు కథ పూర్తీ చేసేది. మళ్ళా దాన్ని ఫెయిర్ ఎత్తల్లా – పోస్టు చెయ్యల్లా – రేపటికల్లా ఇదంతా అయ్యే పనేనా?" అంటూ నా చెవిలో జోరీగకు మల్లే రొదపెడుతోంది. సరిగ్గా నేను అనుకున్నట్టే పై వాక్యాలలో కొద్ది మార్పులతో అవే మాటలే అన్నది శారద.

ఏం చేసేది. నాకు ఒక పట్టాన మూడ్ వచ్చి చావదు మరి. నిజానికి శారద అన్న మాటల్లో లేశ మాత్రమైనా అతిశయోక్తి లేదు. నన్ను నూటికి నూరుపాళ్ళూ అంచనా వేసిన మనిషి శారదే!

ఇప్పటికి నాకు కథకుడిగా ఇరవయ్యేళ్ళ అనుభవం. ఇంచుమించూ నూరు కథల దాకా సుప్రసిద్ధ పత్రికలలోనే వచ్చాయి. ఆంధ్రదేశంలో ఒక మోస్తరు గుర్తింపుగల కథకుల్లో నేనూ ఒకణ్ణి. ఎన్నో పోటీలలో నా కథలకు బహుమతులు వచ్చినాయి కూడా. అయితే కథలు పుంఖానుపుంఖంగా ఏనాడూ రాసి ఎరుగను.

ప్రతి మగవాడి విజయం వెనుక ఒక స్త్రీ వుంటుందట. అది నా విషయంలో కూడా నిజమయిందని ఒప్పుకోవాలి.

ఎప్పుడన్నా ఏ పత్రికలోనన్నా 'కథల పోటీ' అంటూ ప్రకటన చూసిందా, ఇంక అంతే – ఆ క్షణం నించీ నన్ను నిలబడనివ్వదూ, కూర్చోనివ్వదూ, పడుకోనివ్వదూ, ఇంక ఏ పనీ చేసుకోనివ్వదు. 'కథల పోటీకి టైము అయిపోతోంది' అంటూ నా చెవిన ఇల్లు కట్టుకుని మరీ చెబుతూ ఉంటుంది శారద.

పైగా మా శారదకి మరొక్క విషయం కూడా తెలుసునండోయ్! ఇప్పట్లో ఎట్లాంటి కథలకి బహుమతులు వస్తున్నాయోకూడా సూచించగలదు. అందుకే దళిత వాదం మీదైనా, స్త్రీ వాదం మీదైనా ఒక మంచి కథ రాయమన్నది. కథ ముగింపులో కరుణరసం ఉండి తీరాలని సూచన చేసింది కూడా.

ఏమైతేనేం ఆ సాయంత్రానికి దళితవాదం మీద కథ పూర్తి చేశాను. దానికి 'గుడిసె' అన్న పేరు పెట్టాను. నా రచనలన్నిటికీ మా ఆవిడే మొదటి పాఠకురాలు. నేను ఆవిడ చేతికి కథను అందించిందే తడవుగా, నా పక్కనే కూచుని పదిహేను నిమిషాల్లో కథని చదివేసింది. అందాకా ఆమె ముఖకవళికలు గమనిస్తూ కూచున్నాను. కథంతా చదివాక ఆమె మొహం సీరియస్‌గా మారిపోయింది. శారదకి కథ నచ్చలేదా? కథలో లీనమై అలా అయిపోయినదా – అని ఆలోచిస్తున్నాను.

"చానా బాగొచ్చింది కథ. పోటీలో తప్పక నిలబడుతుంది." అంది శారద సీరియస్‌గా వున్న ముఖకవళికల్ని సంతోషంగా ఉండేలా మార్చేస్తూ.

"హమ్మయ్య" అనుకుని, నవ్వుతూ చూశాను.

"మనసు పెట్టి రాస్తే కచ్చితంగా మంచి కథ రాస్తావని తెలుసు నాకు. తప్పకుండా ఈ కథకి ఫస్టుప్రైజు వచ్చి తీరుతుంది!" అంటూ హామీ కూడా ఇచ్చేసింది శారద.

ఎట్లో ఆవిడ దగ్గర నా పరువు నిలబెట్టుకున్నాను. ఇక ప్రైజు సంగతి దేవుడెరుగు అనుకుని, వెంటనే 'గుడిసె' కథని ఫెయిర్‌చేసి, ఆ మరుసటిరోజే కథల పోటీకి పంపేశాను.

ఒకనెల తర్వాత ఓ మధ్యాహ్నం ఆఫీసు నించీ ఇంటికొస్తూనే మా ఆవిడ వాకిట్లోనే నిలబడి వుంది. నేను దగ్గరకి వెళ్తూనే - "కంగ్రాచ్యులేషన్స్ శ్రీవారూ! మీ కథకి మొదటి బహుమతి - ఇద్దో ఇందాకే టెలిగ్రాం అందింది" అంటూ టెలిగ్రాం నాచేతికందించింది.

సంభ్రమాశ్చర్యాలతో దాన్ని చదువుకున్నాను-" మీ 'గుడిసె' కథ అవార్డు అందుకున్నది. శుభాకాంక్షలు - హైదరాబాదు రవీంద్రభారతిలో ఈనెల 26వ తేదీ, సాయంత్రం 6 గంటలకి జరుగనున్న మా సభలో మీకు బహుమతికి ప్రదానం చేస్తున్నాం. తప్పక సభకు హాజరుకాగలరు." అదీ టెలిగ్రాంలోని ఆంగ్ల వాక్యాల సారాంశం.

నిజంగా నా కాళ్ళు భూమిమీద నిలిచేలాలేవు. మా ఆవిడ కాస్త మందంగా వుంది కానీ, లేకపోతే సినిమాలో హీరో, హీరోయిన్ని తిప్పినట్టు గిరగిరా గాల్లో తిప్పేసి ఉండే వాడిని.

మా అమ్మాయి అరుణ, మా అబ్బాయి నవీన్‌లు భోజనాలు చేస్తూ - 'నాన్నా! కంగ్రాట్స్ మేముకూడా నీతోపాటు హైదరాబాదుకు వస్తున్నాము" అంటూ ప్రకటించేశారు.

"మేము కూడా అంటే - నేను వెళుతున్నానని అనలేదే -" అన్నాను వాళ్ళతో.

"ఎందుకు పోవూ - వాళ్ళేదో ఘనంగా నీకు రవీంద్ర భారతిలో బహుమతి ప్రదానం చేస్తామంటూ వుంటే!" అంది శారద నాకు భోజనాలు వడ్డిస్తూ.

"ఎందుకు లేవే, మనమంతా పొయ్యేది - డబ్బు దండగ - పత్రిక వాళ్ళే చెక్కుని పోస్టులో పంపిస్తారులే" అన్నాను.

"అన్నీ ఇంతే నువ్వు... ఇది బహుమతి రావడంకన్నా గొప్ప విషయం కాదా. గౌరవంగా బహుమతిని అందుకోవడం - పత్రికల్లో మీ ఫోటోలు రావడం-" అంటూ ఆవిడ నన్ను కన్విన్సు చేసేలా నవ్వింది.

"అది కాదు శారదా! టెలిగ్రాం చదివినావా? అందులో- 'మీ గుడిసె కథ అవార్డు అందుకుంది' అని రాశారు. అంతేకానీ ఏ అవార్డు? మొదటిదా? రెండోదా? మూడోదా? లేకుంటే కన్సోలేషనా, ఏదనీ, కొంపదీసి కన్సోలేషనే అయితే, కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే ఇస్తారు. అంటే మనమందరం హైదరాబాదుకు పోయి బహుమతిని అందుకుంటే రానూపోనూ ఖర్చులకే సరిపోతుంది ఆ బహుమతి డబ్బంతా" అన్నాను.

"నువ్వెప్పుడూ ఇంతే... అన్నిటినీ శంకించడమే పని. అవార్డు అని దేన్ని అంటారు చెప్పు - కన్సోలేషన్ ప్రైజుని అవార్డు అంటారా ఎక్కడయినా? మొదటి బహుమతినే అవార్డని అంటారు" అంటూ 'అవార్డు' అన్న పదానికి కొత్త అర్థాన్ని నిర్ధారించింది శారద.

భోజనం చేశాక టెలిగ్రాం కాగితాన్ని జేబులో పెట్టుకొని ఆఫీసుకి వెళ్ళాను.

మా కొలీగ్స్ అందరూ దాన్ని చూసి చాలా సంబరపడిపోయారు - " మీ కథకి పదివేలు రావడం పెద్ద విషయం కాదుకానీ, మీరు రవీంద్రభారతిలో ప్రైజు అందుకోవడం వుందే, అది నిజంగా గొప్ప విషయం" అంటూ నా అదృష్టాన్ని ఒకటే మెచ్చేసుకున్నారు.

మరైతే, హైదరాబాదుకి కుటుంబసమేతంగా వెళ్ళడమే మంచిదనిపించింది. ఆ మాటే ఇంట్లో చెప్పాను. ఎగిరి గంతేసినారు. మా ఆవిడా. పిల్లలూ. 'అయితే నెలాఖరు రోజులు కదా, ఎట్ల చెయ్యడం అనీ? 'డబ్బు ఎక్కడినించి వస్తుంది'? అన్నది నా ఆలోచన.

"ఎక్కడయినా ఒక అయిదువేలు అప్పు చేయండి. హైదరాబాదులో నాలుగు రోజులు గడిపేసి వద్దాం!" అంది శారద.

సరే, నా దగ్గరి మిత్రుడితో 5 వేలు అప్పు చేశాను. మేమంతా బయల్దేరుతూ ఉంటే - మా అమ్మ, తమ్ముడూ, ఇద్దరి చెల్లెళ్లనీ వదలి వెళ్ళడమా అనిపించి, వాళ్ళనీ రమ్మన్నాను. అందరం ఎనిమిది మందిమి అయినాము. 26వ తేదీ బహుమతి ప్రదానం కాబట్టి 21వ తేదీనే బయల్దేరి హైదరాబాదు చేరుకున్నాం. అక్కడ మా మామయ్య శ్రీనివాసులు సెక్రటేరియట్‌లో సూపర్నెంటుగా ఉంటున్నాడు. వాళ్ళ ఇంట్లో దిగాము. హైదరాబాదు చుట్టుపక్కలవున్న చూడదగ్గ ప్రదేశాలన్నీ నాలుగు రోజులలో చూసేశాము. మా పిల్లలు ఒకటే ఆనందపడిపోయినారు.

తీసుకుపోయిన డబ్బు ఎప్పుడో అయిపోయింది. అందుచేత మా మామయ్య దగ్గర మరో 5 వేలు అప్పు చేశాను.

"బహుమతి డబ్బేకదా - ఖర్చయితే అయింది ఇంత హాయీ, ఆనందం మళ్ళీ ఎప్పుడొస్తాయి?" అంది శారద.

హైదరాబాదుకు వెళ్ళినందుకు గుర్తుగా కొన్ని బట్టలూ, బుట్టలూ కొన్నది పిల్లలకు.

ఇక 26వ తేదీ సాయంత్రానికి అందరం మా మామయ్య కుటుంబంతోపాటూ రవీంద్రభారతి చేరుకున్నాం. అక్కడ చాలామందే వున్నారు. సాహిత్య సభకు అంతమంది హాజరు కావడం ఆశ్చర్యంగా ఉంది నాకు.

బహుమతి ప్రదాన సభ ప్రారంభమైంది.

పత్రిక ఎడిటరుగారు మొదట్లో కథల పోటీ విజేతలకి శుభాకాంక్షలు తెలుపుతూ ఈ ఏడాది విజేతలకి ఒక కొత్త పద్ధతిలో బహుమతులను ప్రదానం చేయడం కొద్ది క్షణాల్లో జరుగుతుంది. మా టెలిగ్రాంలను అందుకుని ఇక్కడికి విచ్చేసిన విజేతలకి ఎవరికి ఏ బహుమతి వచ్చిందో తెలీదు. ఇప్పుడు ప్రకటిస్తాం. ఇది ఎంతో థ్రిల్‌గా వుంటుందని ఈ పద్ధతిని ప్రవేశపెట్టాము." అని చెబుతూంటే నా గొంతులో పచ్చి వెలక్కాయ పడింది. అంటే - మొదటి బహుమతి నాకు రావచ్చు, రాకపోనూ వచ్చునన్న మాట! అయితే ఈ సభలో నాలాగా మొదటి బహుమతే వచ్చిందన్న భ్రమతో కుటుంబాలతోనూ, బంధుమిత్రులతోనూ వచ్చినట్టున్నారన్నమాట!

మా ఆవిడవైపు దీనంగా చూశాను -

'మరేం ఫర్వాలేదు ఎట్లయినా మనకథకే మొదటి ప్రయిజు అని ప్రకటిస్తారు చూడండి!" అంటూ గొణిగింది నా చెవిలో -

ఆ మాటకే నాలో నిరుత్సాహమంతాపోయి కొండంత బలం వచ్చేసింది.

కథల పోటీ విజేతల పేర్లు చదవడం మొదలుపెట్టారు, ఎడిటరుగారు - నాకు భరించలేనంత ఉద్వేగంగా ఉంది. గుండెలు కొట్టుకోవడంలో వేగం పెరిగింది. చెవులు రిక్కించి వినడానికి సిద్ధమయినాను.

కథల పోటీలో మొదటి బహుమతి విజేత శ్రీ రామాంజనేయులుగారు రాసిన "చిరుగుల చీర" కథకి వచ్చింది. అంటూ ప్రకటించేసరికి దిమ్మెరపోయాను. మా ఆవిడ

మరింత దిమ్మెరపోయినట్టుంది. ఆవిడని చూస్తే నాకే జాలేస్తోంది. మొదట బహుమతి రచయిత చెక్కునీ, మొమెంటోనీ అందుకుని వస్తూ వుంటే చప్పట్లతో నిండింది హాలంతా-

రెండో బహుమతి పేరు చదివారు ఎడిటరుగారు - నాకు మాత్రం రాలేదు.

మూడో బహుమతి ప్రకటించారు - ఊహూం నాకు రాలేదు.

పూర్తిగా నిరుత్సాహం ఆవరించింది నన్ను.

ఇక కన్సోలేషను జాబితాలో ప్రకటించడం మొదలుపెట్టారు -

అందులో మొదటి పేరు నాదే -

శ్రీ శేఖర్ గారి కథ 'గుడిసె'కి కన్సోలేషన్ ప్రయిజు వెయ్యి రూపాయలు - అంటూ ప్రకటించగానే కొయ్యబొమ్మలా లేచి యాంత్రికంగా వెళ్ళాను. బహుమతినందుకుని వచ్చాను. కొందరు చప్పట్లు కొడుతున్నారు. ఎగతాళి చేస్తూ కాదు కదా! మా మామయ్య షేక్ హ్యాండిచ్చాడు - ఎకసెక్కెం చెయ్యడం కాదు కదా-

అరగంట తర్వాత అయిపోయింది సభ. బయటికి వస్తూ వుంటే

"ఈ పత్రికల వాళ్ళు రచయితలతో ఆడుకుంటున్నారు - టెలిగ్రాం ఇస్తే అందులో ఏ బహుమతి వచ్చినదీ స్పష్టంగా లేకపోవడంతో ఎవరికి వారే తమకే మొదటి ప్రయిజు వచ్చిందని బంధువులతోపాటు వచ్చారు. అందుకే సభలో ఇంతమంది జనం - కనీసం రచయితకి రానూపోనూ ఖర్చులుకూడా భరించము అని చెప్పేసినారట" అని ఎవరో అంటున్నారు. మౌనంగా వింటూ నడుస్తున్నాను బహుమతి నష్టం 9 వేలూ కళ్ళముందు తిరుగుతున్నాయి.

నా మొహంలోకి చూస్తూ శారద - "ఈసారి హాస్యవ్యంగ్య కథల పోటీకి, ఇక్కడ జరిగినదంతా 'మొదటి బహుమతి' అని కథ రాస్తే సరి. మన నష్టమూ పూడుతుంది, ఈ పత్రికవాళ్లమీద దెబ్బతీసినట్టూ ఉంటుంది - ఏమంటావు?' అంది.

అదీ మా శారదంటే!

● *రచనా కాలం 1997 - అనంతపురం,*

*ఆకాశవాణిలో ప్రసారం - 1997* ●